విశాలాంధ్ర

ప్రకాశం బాపట్ల

శుక్రవారం 19 ఏప్రిల్ 2024 8 పేజీలు

నామినేషన్ల కోలాహలం

- దర్శిలో సత్తా చాటిన బూచేపల్లి
- తరలివచ్చిన వేలాదిమంది వైసీపీ శ్రేణులు
- ఇక్కడి నుంచే రాజకీయ ప్రస్థానం మొదలైంది
- ఇక్కడి నుండే రాజకీయం చేస్తా
- బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : సార్వత్రిక ఎన్నికలలో కీలక ఘట్టమైన నామినేషన్ల పర్వం రానే వచ్చింది. గురువారం దర్శిలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేసి జిల్లా దృష్టిని మరల్చుకున్నారు. దర్శి నియోజకవర్గంలోని ఐదు మండలాల నుండి వేలాది మంది వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం 9 గంటలలోపు దర్శి సమీపంలోని రాజంపల్లి ఆంజనేయస్వామి గుడివద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన బూచేపల్లి కుటుంబ సభ్యులు అక్కడి నుండి కొత్తరెడ్డిపాలెం మీదుగా దర్శి గడియార స్తంభం వరకు నిర్వహించిన ర్యాలీ అందరినీ ఆకట్టుకుంది. శివప్రసాద్‌రెడ్డితో పాటు తన భార్య నందిని, వారి తల్లి జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో పాటు వైసీపీ ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఈ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీలో పలువురు వైయస్ రాజశేఖర్‌రెడ్డి వేషధారణతో ఆకట్టుకున్నారు. దారిపొడవునా బూచేపల్లికి మహిళలు హారతులుపట్టి దిష్టి తీశారు. నియోజకవర్గంలోని ముండ్లమూరు, తాళ్లూరు, కురిచేడు, దొనకొండ మండలాల నుంచి వేలాది మంది వైసీపీ శ్రేణులు, బూచేపల్లి అభిమానులు తరలివచ్చారు. ఊహించని విధంగా ర్యాలీకి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా గడియార స్తంభం

మిగతా 2 లో ...

టీడీపీ ఎంపీ అభ్యర్థి మాగుంట నామినేషన్ దాఖలు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : తెలుగుదేశం పార్టీ ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసరెడ్డి గురువారం ఉదయం ఒంగోలులో నామినేషన్ దాఖలు చేశారు. తన కుటుంబ సభ్యులు సన్నిహితులతో కలిసి నామినేషన్ సెట్‌లను దాఖలు చేయడం జరిగింది. ఎన్నికల ప్రక్రియలో భాగంగా 18 నుంచి 25వ తేదీ వరకు నామినేషన్ ప్రక్రియ కొనసాగుతుంది. గురువారం మంచిరోజు కావడం, మాగుంట శ్రీనివాసరెడ్డి పేరు మీద బాగుండటంతో మాగుంట దాఖలు చేశారు. ఈ నెల 24న ఒంగోలు టీడీపీ అభ్యర్థి దామచర్ల జనార్ధన్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఒంగోలు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. దీంతో మాగుంట మరోమారు ర్యాలీలో అక్కడ

మిగతా 2 లో ...

కొండెపీ అభివృద్ధికి ఒక్క అవకాశం ఇవ్వండి

8 లో..

22న నామినేషన్ ఏర్పాట్లపై సమీక్షించిన మంత్రి సురేష్

నరేంద్రవర్మ నాకు మంచి మిత్రుడు.. ఎమ్మెల్యేగా గెలిపిస్తా

మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్

విశాలాంధ్ర - బాపట్ల : టీడీపీ ఎమ్మెల్యేగా అభ్యర్థిగా పోటీ చేస్తున్న వేగేశన నరేంద్రవర్మ నాకు 25 ఏళ్లుగా మంచి మిత్రుడు ఎమ్మెల్యేగా గెలిపించి తీరుతానని మాజీ ఎమ్మెల్సీ బీజేపీ నాయకులు అన్నం సతీష్‌ప్రభాకర్ స్పష్టం చేశారు. టీడీపీ కార్యాలయంలో గురువారం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నం సతీష్ మాట్లాడుతూ బీజేపీ,జనసేన,టీడీపీ కలయికతో బాపట్ల నియోజకవర్గం నుండి వైసీపీ అభ్యర్థి కోనరఘుపతిని గౌరవంగా ఇంటికి సాగనంపుతామన్నారు. అన్నం సతీష్ ప్రభాకర్ అనే నాకు,వేగేశన నరేంద్ర వర్మకి మధ్య ఎలాంటి గ్యాప్ లేదన్నారు.పాతికేళ్లుగా మేమిద్దరూ మంచి మిత్రులమని పదిహేనేళ్లుగా వ్యాపార భాగస్వాములుగా కలిసి పని చేశామన్నారు.జనంలో వచ్చే అపోహలను, నరేంద్ర వర్మని గెలిపించి ఫుల్ స్టాప్ పెడతానని మాట ఇచ్చారు. నేను రెండు సార్లు బాపట్ల తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన సంగతిని గుర్తుచేస్తూ మూడోసారి తన మిత్రుడు వేగేశన నరేంద్రవర్మని ఎమ్మెల్యేగా గెలిపించి తనకు గొప్ప బహుమతిగా ఇవ్వాలని

మిగతా 2 లో ...

ప్రారంభమైన నామినేషన్ల ఘట్టం

- తొలిరోజు 8 అసెంబ్లీ , రెండు పార్లమెంట్ స్థానాలకు నామినేషన్లు
- పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీస్ శాఖ
- ఈ నెల 25వ తేదీతో ముగియనున్న గడువు
- జిల్లా ఎన్నికల అధికారి రంజిత్‌బాషా

విశాలాంధ్ర - బాపట్ల : జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అత్యంత నామినేషన్ల ఘట్టం గురువారం ఆరంభమైంది. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా విడుదల చేశారు. నామినేషన్ ప్రక్రియను బాపట్ల పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయం నుంచి జిల్లా ఎన్నికల అధికారి గురువారం ప్రారంభించారు. తదుపరి జిల్లా ఎన్నికల అధికారి రంజిత్ బాషా, ఎస్పీ వకుల్ జిందాల్ కలిసి స్పందన సమావేశ మందిరంలో మీడియా సమావేశం నిర్వహించారు. పార్లమెంటు, శాసనసభ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ఈనెల 25వ తేదీ వరకు జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. 26వ తేదీన నామినేషన్ పత్రాల పరిశీలన, 29న ఉపసంహరణ ప్రక్రియతో పోటీలో ఉండే అభ్యర్థుల పేర్లు స్పష్టంగా తెలుస్తోందన్నారు. మే 13వ తేదీన ఎన్నికలు జరుగుతాయని, జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గం ఒకటి, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు నామినేషన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఉదయం 11 నుంచి సాయంత్రం మూడు గంటల వరకు అభ్యర్థులు ఎవరైనా నామినేషన్ వేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు నామినేషన్ తో పాటు వివరాలతో ధ్రువీకరణలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల నిబంధనలను రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తప్పనిసరిగా అనుసరించాల్సి ఉంటుందన్నారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయాల వద్ద హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేశామన్నారు. జాతీయస్థాయి గుర్తింపు పొందిన పార్టీలు ఆమ్ ఆద్మీ పార్టీ, బిజెపి, నేషనల్ కాంగ్రెస్ పార్టీ, బి ఎస్ పి, సిపిఎం, నేషనల్ పీపుల్స్ పార్టీలు ఉండగా, రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన పార్టీలు వైసిపి, టిడిపి పార్టీలు ఉన్నాయన్నారు. హెూమ్ ఓటింగ్ కొరకు దివ్యాంగులు, 85 సంవత్సరాలు దాటిన వారిని గుర్తించి వారి ఇంటిటికీ వెళ్లి దరఖాస్తులను పంపిణీ చేశామని జిల్లా ఎన్నికల అధికారి రంజిత్ బాషా తెలిపారు. 22వ తేదీలోగా పూర్తి చేసిన దరఖాస్తులను ఆర్ఓలకు అందిస్తే మే నెల మూడు నుంచి 10వ తేదీ లోగా హెూమ్ ఓటింగ్ నిర్వహించడానికి చర్యలు తీసుకుంటా మన్నారు. ఎన్నికల విధుల్లో ఉండే వారికి, అత్యవసర సేవల విభాగంలో ఉండే వారి కొరకు పోస్టల్ బ్యాలెట్ నిర్వహిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు చేసుకున్న వారికి రిటర్నింగ్ అధికారి వద్ద పోస్టల్ ఓటింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇంటింటికి ఓటర్ స్లిప్పులు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. నామినేషన్ ప్రక్రియ ప్రారంభం నుండి

మిగతా 2 లో ...

వైసీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

విశాలాంధ్ర-వెలిగండ్ల : పేద ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న వైసీపీ ప్రభుత్వాన్ని ఆదరించాలని వైఎస్ఆర్సిపి అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ ప్రజలను అభ్యర్థించారు. గురువారం మండలంలోని నాగులవరం, రాళ్లపల్లి, జాల్లపాలెం తదితర గ్రామాలలో ఇంటింటి మన ప్రభుత్వం ప్రకాశం జిల్లా జడ్పిటిసి సంఘం అధ్యక్షులు వెలిగండ్ల జడ్పిటిసి గుంటక తిరుపతిరెడ్డి తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మే 13వ తేదీన జరగనున్న ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించి మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని ఆయన కోరారు. కనిగిరి నియోజకవర్గం అభ్యర్థి నైనా నన్ను ఆదరించాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రామన్న తిరుపతిరెడ్డి, వైస్ ఎంపీపీ తాతపూడి మేరీ పుష్ప పాల్గొన్నారు.

టీడీపీ ఎంపీ అభ్యర్థి మాగుంట నామినేషన్ దాఖలు

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొననున్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన కొండేపీ అభ్యర్థి డోలా బాల వీరాంజనేయస్వామి, సంతనూతలపాడు అభ్యర్థి బీఎన్ విజయ్‌కుమార్, యర్రగొండపాలెం అభ్యర్థి ఎరిక్షన్ బాబు, గిద్దలూరు అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి, దర్శి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి నేడు నామినేషన్ దాఖలు చేయనున్నారు. నేడు మంచిరోజు కావడంతో కొన్ని సెట్‌లను వీరు నామినేషన్ దాఖలు చేస్తారు. రెండు మూడు రోజుల్లో మరో సెట్‌ను నామినేషన్ చేస్తారు. అందుకు సంబంధించి ఏర్పాట్లను చేస్తున్నారు. నేడు కొండేపీలో డోలా బాల వీరాంజ నేయస్వామి నామినేషన్ అట్టహాసంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దామచర్ల సత్య దగ్గరుండి ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

నామినేషన్ల కోలాహలం

(మొదటిపేజీ తరువాయి)

వద్ద శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గత 20 సంవత్సరాల నుంచి దర్శి నుంచే తమ రాజకీయం చేస్తున్నామని తెలిపారు. తన తండ్రి బూచేపల్లి సుబ్బారెడ్డి 2004లో రాజకీయ ప్రస్థానం దర్శి నుంచే మొదలైందని, తాను దర్శి నుంచే 2009లో ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందానన్నారు. ఇక్కడే ఇళ్లు కట్టుకొని నియోజకవర్గ ప్రజలతో మమేకమై మీలో ఒకడిగా ఉంటున్నానని అన్నారు. ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు ఆదరించి ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. తద్వారా నియోజకవర్గంలో తాగునీటి సమస్య దగ్గర నుంచి సాగునీటి సమస్య, రోడ్లు, డ్రైనేజీ, స్కూళ్లు, హాస్పటల్స్ అన్ని మౌలిక సదుపాయాలతో పాటు పేద, బడుగు, బలహీన వర్గాలకు ఆర్థికంగా అండగా ఉంటానని పిలుపునిచ్చారు. ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ శివప్రసాద్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమం చూస్తుంటే దాదాపు శివప్రసాద్‌రెడ్డి గెలిచినట్లేనని తెలిపారు. ఈరోజు శివకు మద్దతుగా వేల మంది తరలిరావడం జరిగిన ర్యాలీ ఇప్పటి వరకు నేను ఏ నియోజకవర్గంలో చూడలేదని పేర్కొన్నారు. అనంతరం బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తహశీల్దార్ కార్యాలయంలో రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. వీరితో పాటు తన భార్య నందిని కూడా మరో సెట్‌ను దాఖలు చేశారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

టీడీపీలోకి దివి పున్నారావు

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మండలంలో వివిధ గ్రామాలనుండి వైఎస్ఆర్ సిపి వీడి టిడిపిలో గురువారం చేరారు. పోతవరంగ్రామంలో కాంగ్రెస్, వై ఎస్ ఆర్ సిపి మాజీ మండల అధ్యక్షులు దివి పున్నారావు, మాజీ ఎం పి పి దివి రంగవల్లి దంపతులతో పాటు 100 కుటుంబాల నుండి షుమారు 200 మంది వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీని వీడి సంతనూతలపాడు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి బి ఎన్ విజయకుమార్ నాయకత్వంలో పున్నారావు స్వగృహంలో టిడిపి లో చేరారు వారికి పార్టీ జెండాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు దివిపున్నారావు మొదటి నుండి కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతూ 21సంవత్సరాలపాటు కాంగ్రెస్ పార్టీ ఆతరువాత వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా పనిచేసారు అదేవిధంగా ఆయన సతీమణి రంగవల్లి ఎంపిపిగా కొనసాగారు మాకు వై ఎస్ ఆర్ సిపి ఎటువంటి గౌరవం దక్కక పోవడంతో వైసిపి పార్టీని వీడి టిడిపి లోకి రావడం జరిగిందని పున్నారావు తెలిపారు అదేవిదంగా అగ్రహారం గ్రామంలో మాజీ ఎంపిటిసి పొద శ్రీదర్ తన అనుచర వర్గానికి చెందిన 50 కుటుంబాలు ఎస్ సి కాలనీకి చెందిన మరో 50కుటుంబాలతో వై ఎస్ ఆర్ సిపి వీడి టిడిపిలోకి చేరారు వారికి బి ఎన్ విజయకుమార్ పార్టీ జెండాలు కప్పి ఆహ్వానించారు ఓబన్నపాలెం గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్‌కు చెందిన మాజీ సర్పంచ్ ఒక్కంటి శ్రీనివాసరావు, సొసైటీ మాజీ అధ్యక్షులు మండవ ప్రసాదు, పోలినేని సింగరావు ల ఆధ్వర్యంలో పోలినేని, కట్టా, మండవ తదితర కుటుంబాలకు చెందిన అన్నికుటుంబాలవారు వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీని వీడి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి బి ఎన్ విజయకుమార్ సమక్షంలో తెలుగు దేశం పార్టీలో చేరారు దాంతో ఓబన్న పాలెం లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పూర్తిగా ఖాళీ అయ్యింది ఈసందర్భంగా బి ఎన్ విజయకుమార్ మాట్లాడుతూ పోతవరం, అగ్రహారం, ఓబన్న పాలెం తదితరగ్రామాలనుండి సీనియర్ నాయకులు టిడిపి లోకి రావడం సంతోషంగా ఉందన్నారు తనను రానున్న ఎన్నికల్లో ఆదరించి గెలుపుకు కృషిచేయాలని కోరారు. ఈకార్యక్రమంలో క్లస్టర్స్ ఇన్ చార్జిలు గుమ్మడి సాయిబాబా, కాకర్ల లక్ష్మి వరప్రసాదు, మాజీఎంపిపి ముప్పవరపు వీరయ్యచౌదరి, టిడిపి మాజీ మండల అధ్యక్షులు షేక్ ఖాజావలి, టిడిపి మండల అధ్యక్షులు తేళ్ళ మనోజ్, మండల మహిళా నాయకురాలు గూడూరి ఝాన్సీ, సెల్వం, నార్నె అంజయ్య, పొద వరప్రసాదు, గూడూరి హనుమంతరావు, గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

నరేంద్రవర్మ నాకు మంచి మిత్రుడు.. ఎమ్మెల్యేగా గెలిపిస్తా

(మొదటిపేజీ తరువాయి)

ప్రజలను అభ్యర్థించారు.రైతులకు సాగు నీరు విషయంలో తన సొంతపార్టీకి చెందిన నీటి పారుదల శాఖామంత్రిని ఘెరావ్ చేసి రైతుల పక్షపాతిగా రైతుల పక్షాన నిలిచానన్నారు..నరేంద్ర వర్మ మంచి మనసున్న వ్యక్తే కాదు,మంచి వ్యక్తిత్వం గల సమాజసేవకుడని అలాంటి వ్యక్తిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని మూడు పార్టీల,కార్యకర్తలకు, అభిమానులకు పిలుపునిచ్చారు.ఎంపీగా తెన్నేటి కృష్ణ ప్రసాద్‌ని గెలిపించాలన్నారు.రానున్నది సంకీర్ణ ప్రభుత్వమే గెలించేంతవరకే కాదు,గెలిచాక కూడా మూడు పార్టీలు ఉమ్మడిగా పనిచేస్తామన్నారు. నియోజకవర్గంలో తెలుగుదేశానికి చాలా బలమైన క్యాడర్ ఉందని కార్యకర్తలందరూ కలిసి పని చేద్దామని తన పాత సైన్యాన్ని కోరారు. గడచిన నాలుగు సార్వత్రిక ఎన్నికల్లో రెండు సార్లు కాంగ్రెస్, రెండు సార్లు వైసీపీ బాపట్ల అసెంబ్లీ స్థానాన్ని కైవశం చేసుకుందని వరుసగా ఒకే పార్టీకి అధికారం ఇస్తే నియంతృత్వ పాలనకు దారితీస్తుందన్నారు.ప్రజలు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఎన్డిఏ అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మని గెలిపించుకోవాలన్నారు.గత తెలుగుదేశ ప్రభుత్వ పాలనను,వైసీపీ పాలనలో జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకోవాలని ప్రజలకు సూచించారు.బాపట్ల రాజకీయ చరిత్రను తిరగరాసే అవకాశం వచ్చిందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలన్నారు.తాగు నీరు విషయంలో విపరీతమైన నీటి ఎద్దడి ఉందని మున్సిపాలిటీలో మూడురోజులకొక సారి కూడా నీళ్లు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారు. సాగు నీటి విషయంలో పంటలు ఎండిపోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతుంటే ప్రత్యామ్నాయమైన చేపలు చెరువులు, ఇసుక అమ్ముకోవడాలు లాంటి విషయాలపై దృష్టి సారించమని రైతులకు వైసీపి ప్రజాప్రతినిధులు సలహాలివ్వడం అనేది రైతుల పట్ల చిన్న చూపు చూడటమే అని మండిపడ్డారు.స్థానిక సంస్థల ఎన్నికలు జరిపిస్తే,స్థానిక సమస్యలు కౌన్సిలర్లు,వార్డు మెంబర్ల ద్వారా చైర్మన్ దృష్టికి, ఎమ్మెల్యే దృష్టికి వెళ్లి సమస్యల పరిష్కారానికి కారణమవుతుందన్నారు. అలా కాకుండా వైసీపి ఎన్నికలు జరగకుండా కోర్టులో తమ వారితోనే కేసులు వేయించి ఎన్నికలను జరగకుండా అభివృద్ధికి అడ్డుపడుతున్నారని విమర్శించారు. తొలుత వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా కోన రఘుపతి బాపట్ల మున్సిపాలిటీ అభివృద్ధి చెందకుండా అడ్డుపడ్డారని ఆవిమర్శించారు. మున్సిపల్ ఎన్నికలు జరగకుండా అడ్డుపడి, మున్సిపల్ కమిషనర్ ద్వారా ఏక పక్ష నిర్ణయాలు తీసుకుంటూ,బిల్డింగ్ ప్లాన్లు, ప్రొసీడింగ్స్ విషయంలోను ఎమ్మెల్యే కోనరఘుపతి అనేక అవ కతవకలకు పాల్పడిన విషయం బాపట్ల ప్రజానీకానికి తెలుసన్నారు. గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం పేరుతో స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రజలను దూరం చేస్తున్నారన్నారు.గ్రామీణ ప్రజలకు గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని దూరం చేసి ఈ వైసిపి ప్రభుత్వం పేదల పొట్టకొడుతోందని మండిపడ్డారు. యథాతథంగా మున్సిపల్ ఎన్నికలను జరిపించి అభివృద్ధి చేస్తామన్నారు. మున్సిపల్ చైర్మన్ విషయంలో గత తొమ్మిది దఫాలుగా చైర్మన్ పదవిని కాపులకు కేటాయించడం జరిగిందని ఆ సాంప్రదాయాన్ని తెలుగుదేశం కొనసాగిస్తుందని ఆయన హామీ ఇచ్చారు.తాగు నీరు,సాగు నీరు, మురుగు కాలువల ప్రక్షాళన,దోమల్ని నివారించే విషయంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఎమ్మెల్సీగా అన్నం సతీష్ తన పదవీకాలంలో ప్రజలకు తాగునీరు, సాగు నీరు విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశారని నరేంద్ర వర్మ కొనియాడారు. స్థానిక ప్రజల,నాయకుల అభిప్రాయ సేకరణతోనే వారికి అనుగుణమైన విలీన ప్రక్రియపై తమ ప్రభుత్వం నిర్ణయం తీసు కుంటుందని విలీన గ్రామాల ప్రజలకు భరోసా ఇచ్చారు. జనసేన పార్టీ సమన్వయ కర్త నామన వెంకట శివన్నారాయణ మాట్లాడుతూ ఎన్డిఏ కూటమి నుండి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్ర వర్మ విజయము కోసం ప్రతి ఒక్కరూ కృషి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, మూడు పార్టీల అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన నామినేషన్ల ఘట్టం

(మొదటిపేజీ తరువాయి)

స్టాటిక్ సర్వేలెన్స్ టీములు పనిచేయస్తాయని జిల్లా ఎన్నికల అధికారి చెప్పారు. ఫ్లయింగ్ స్క్వాడ్స్, ఎక్స్ పెండిచర్ టీమ్ లు మొత్తం కలిపి జిల్లాలో 357 టీమ్ లు పనిచేస్తున్నాయని వివరించారు. ఎంసిఎంసి, సోషల్ మీడియా, వెబ్ క్యాస్టింగ్, ఎక్స్ పెండిచర్ కమిటీ, ఎంసిసి, సి-విజిల్, కమాండ్ కంట్రోల్ రూమ్, సీజర్ మేనేజ్మెంట్ కమిటీ, లిక్కర్ మేనేజ్మెంట్ కమిటీ, గ్రీవెన్స్ కమిటీలు సమర్థంగా పనిచేస్తున్నా యన్నారు. జిల్లాలో 1,510 పోలింగ్ కేంద్రాలు ఉండగా, క్రిటికల్ పోలింగ్ కేంద్రాలలో వెబ్ కాస్టింగ్ నిఘా ఉంచుతామన్నారు. సి-విజిల్ ద్వారా 374 ఫిర్యాదులు వచ్చాయని, 43 నిమిషాల్లోనే వాటిని పరిష్కరించామని వివరించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కింద ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, వాలంటీర్లపై చర్యలు తీసుకున్నామన్నారు.

- నామినేషన్ ప్రక్రియ నుంచి ప్రతి ఒక్క అభ్యర్థి, రాజకీయ పార్టీల నాయకులు తప్పనిసరిగా ఎన్నికల నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఆర్వోల వద్ద ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక డిఎస్పి స్థాయి అధికారిని నోడల్ ఆఫీసర్ గా నియమించామన్నారు. ఆర్వో కార్యాలయాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులు ర్యాలీలు, రోడ్ షోలు నిర్వహించాలంటే ముందుగానే సంబంధిత అధికారుల నుండి అనుమతులు పొందాలన్నారు. ఎవరైనా ఎన్నికల నియమావళి అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ప్రవర్తించినా, అక్రమ మద్యం, నగదు, డ్రగ్స్, ఇతర వస్తువులు కలిగి ఉండటం, రవాణా చేస్తున్నా సి-విజిల్, కమాండ్ కంట్రోల్ రూమ్‌కి సమాచారం అందించాలన్నారు. సమస్యాత్మక గ్రామాలలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బీఎస్ఎఫ్ దళాలతో పోలీస్ అధికారులు, సిబ్బంది కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామని ఎస్పీ చెప్పారు. చెడు నడత కలిగిన వారు, పాత నేరస్తులు, రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించామన్నారు. ఇప్పటికే సెక్షన్ 110 సీఆర్‌పీసీ ప్రకారం 793 మందిని బైండోవర్ చేశామని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొనకుండా వివిధ రాజకీయ పార్టీలకు చెందిన 8,819 మందిని బైండోవర్ చేశామన్నారు. ఆయుధాలను ప్రదర్శిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

జిల్లాలో మొత్తం 137 లైసెన్స్ కలిగిన తుపాకులు ఉన్నాయని, వాటిలో 98 తుపాకులను స్వాధీనం చేసుకోగా, మిగిలిన 39 తుపాకులు బ్యాంకింగ్ సంబంధిత కార్యకలాపాల కొరకు సెక్యూరిటీ సిబ్బంది వద్ద ఉన్నాయన్నారు. జిల్లాలో మొత్తం 12 చెక్ పోస్ట్ లు ఏర్పాటు చేశామని, ఎస్ఎస్‌టి బృందాలు విధులు నిర్వహి స్తాయన్నారు. 18 ఎస్ ఎస్ టి బృందాలలో 162 మంది సిబ్బంది 24 గంటల పాటు వివిధ ప్రాంతా లలో వాహన తనిఖీలు నిర్వహిస్తారన్నారు. ఎన్నికల నియమావళి అమలులోకి వచ్చినప్పటి నుండి నగదు, మద్యం, బంగారం, వెండి ఆభరణాలు, వాహనాలను వివిధ కేసులలో సీజ్ చేశామని, వీటి విలువ మొత్తం రూ.3.17 కోట్లు ఉంటుందన్నారు. 2019వ సంవత్సరం ఎన్నికలతో పోలిస్తే ఐదు రెట్లు అధిక మన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీఫారం అందుకున్న కాంగ్రెస్ అభ్యర్థి విజేష్‌రాజ్

విశాలాంధ్ర-సంతనూతలపాడు : ఆంధ్ర ప్రదేశ్ పిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి చేతుల మీదుగా సంత నూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ శాసనసభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బీఫారంను పాలపర్తి విజేష్ రాజ్ గురువారం అందుకున్నారు. ఈ సందర్భంగా పాలపర్తి విజేష్ రాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి ముఖ్యంగా వైఎస్ షర్మిల రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ సైనికుడిగా నిజాయతీగా పనిచేస్తాను అని ఆయన తెలియజేశారు. పాలపర్తి విజేష్ రాజ్ తండ్రి మాజీ ఎమ్మెల్యే పాలపర్తి డేవిడ్ రాజుకు, మాజీ కేంద్ర మంత్రి మరియు బాపట్ల పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జేడీ శీలంకి, బాపట్ల జిల్లా పార్టీ అధ్యక్షులు గంటా అంజి బాబు కి అలాగే తనకు దీవెనలు అందించిన కాంగ్రెస్ పార్టీ పెద్దలు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న ఎన్నికలలో హస్తం గుర్తుకు ఓటు వేసి సంతనూతలపాడు ఎంఎల్ఏ గా తనను, బాపట్ల ఎంపీ అభ్యర్థి జేడీ శీలంని గెలిపించాలని కోరారు.

బీజేపీలోకి వలసలు

విశాలాంధ్ర-ఒంగోలు : బిజెపి ఒంగోలు పార్లమెంట్ ఎన్నికల కార్యాలయంలో బిజెపి మహిళా మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయరావు మరియు మహిళా మోర్చ జిల్లా కార్యదర్శి దేవరపల్లి శ్రీలక్ష్మిల ఆధ్వర్యములో పలువురు మహిళలు వైఎస్సార్సీపీ నుండి బిజెపి జిల్లా అధ్యక్షులు శివారెడ్డి, ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ యోగయ్యయాదవ్‌ల నూతనముగా చేరిన వారికి కండువాలు కప్పి పార్టీ లోకి సాదరంగా ఆహ్వానించటం జరిగింది. ఈ సందర్భముగా బిజెపి ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ యోగయ్యయాదవ్ మాట్లాడుతూ చాలా సంతోషం ఎన్నికల సమయములో సహజముగా అధికార పార్టీ వైపు గానీ లేక ప్రతిపక్షం వైపు గానీ చేరతారు. బిజెపి ఇక్కడ పోటీ చేయక పోయినా గానీ బిజెపి సిద్ధాంతాలు, పరిపాలనా విధానం నచ్చి చేరుతున్నారన్నారు. . రాబోవు ఎన్నికలలో ఎన్డీఏ కూటమికి 400 సీట్లు రావటం ఖాయమని రాష్ట్రంలో వైఎస్సార్సీపీ ఓటమి ఖాయమని అన్ని సర్వే లు తెలిపాయి అని చెప్పారు. తదుపరి జిల్లా అధ్యక్షులు శివారెడ్డి మాట్లాడుతూ ఈ రోజు మహిళలు పార్టీ లోకి రావటం చాలా ఆనందముగా ఉన్నదని మహిళలకు ఉజ్వల పథకం ద్వారా ఉచిత గాస్.స్టవ్ రెగ్యులేటర్ ఉచితంగానే ఇస్తున్నారని గ్యాస్ లేని మహిళలు ఈ పథకాన్ని ఉపయోగించు కొనాలని పిలుపు నిచ్చారు.

నామినేషన్ దాఖలు చేసిన దద్దాల నారాయణ

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి వైఎస్ఆర్సిపి అభ్యర్థిగా అసెంబ్లీ ఎన్నికలకు పోటీ చేసే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ గురువారం ఒక సెట్ నామినేషన్ ను ఎన్నికల అధికారి ఆర్డీవో పాలపర్తి జాన్ ఇర్విన్ కు అందజేశారు. మధ్యాహ్నం వైఎస్ఆర్సిపి నాయకులతో కలిసి దద్దల నారాయణ యాదవ్ ప్రత్యేక పూజలు చేసి వైయస్సార్సీపీ కార్యాలయం నుంచి బయలుదేరి ఆర్డీవో కార్యాలయానికి చేరుకున్నారు. నారాయణతో పాటుగా కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫూర్, ఏపీ వాసవి సత్ర సముదాయ అధ్యక్షులు దేవకి వెంకటేశ్వర్లు, రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ కనిగిరి నియోజకవర్గ పరిశీలకులు చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి, న్యాయవాది రామణ తిరుపతిరెడ్డితో వెళ్లి నామినేషన్‌ను దాఖలు చేశారు. మరో సెట్ ను ఈనెల 25వ తేదీ వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీతో నామినేషన్ వేస్తున్నట్లు తెలిసిన సమాచారం.

ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలు ప్రభుత్వాలు ఇచ్చే బిక్ష కాదు

కేఆర్ సూర్యనారాయణ

విశాలాంధ్ర-ఒంగోలు : ఉద్యోగుల ఆర్థికపరమైన ప్రయోజనాలు ప్రభుత్వాలు ఇచ్చే బిక్ష కాదని, అవి వారి హక్కు అని ఏపి ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయుల, కార్మిక, పింఛను సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ కెఆర్ సూర్యనారాయణ అన్నారు. ఒంగోలులోని ఆచార్య రంగాభవన్‌లో ప్రభుత్వ ఉద్యోగుల, కార్మికుల, పింఛను దారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగులకు హక్కుగా వచ్చిన ఆర్థిక పరమైన ప్రయోజనాలు, సంక్షేమ పథకాలను రాబట్టుకోవటంలో గత ఐదు సంవత్సరాల కాలంలో నానా ఇబ్బందులకు గురయ్యారన్నారు. తమ జీతాలను కూడా ఒకటో తేదీకి ఖచ్చితంగా సాధించుకోవటానికి ఉద్యోగులు వల్లకాలేదన్నారు. చేసిన పనికి జీతాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఐఎఎస్, కోర్టు జడ్జీల మాదిరిగా ఒకటో తేదీ నాటికి జీతాలు సక్రమంగా ఉద్యోగుల అకౌంట్‌లలో పడేలా చట్టబద్ధతను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్రప్రభుత్వం సమస్యలు పరిష్కరించమని అడుగుతుంటే పట్టించుకోవటం లేదని తాము గవర్నర్‌కు వినతి పత్రం ఇచ్చినందుకు తమను టార్గెట్ చేసి వేధించారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు దాచుకున్న ఫండ్ నుండి ఉద్యోగులకు తెలియకుండా రూ. 25వేల కోట్లు ప్రభుత్వం లూటీ చేసిందని దుయ్యబట్టారు. దీనిపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే స్పందించటం లేదని, కనీసం నిరసన తెలిపేందుకు కూడా అనుమతులు ఇవ్వటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఉద్యోగుల పట్ల బాగా పనిచేసే ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక కో చైర్మన్ కె హరికృష్ణ, జనరల్ సెక్రటరీ బాజీ పఠాన్ తదితరులు పాల్గొన్నారు.

కొండెపిలో సతీష్ నామినేషన్ దాఖలు

విశాలాంధ్ర-ఒంగోలు : కొండెపి అసెంబ్లీ నియోజక వర్గానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా శ్రీపతి సతీష్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా సతీష్‌ను ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీపతి ప్రకాశం, ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఈద సుధాకర్ రెడ్డి,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి తాడికొండ వెంకటేశ్వరరావు, సిపిఐ నాయకులు మస్తాన్, కొండెపి మండల కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీను,పొన్నలూరు మండల అధ్యక్షులు కృష్ణ,డిసిసి అధికార ప్రతినిధి మనం ప్రసన్నరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు దండాల కృష్ణ,డాక్టర్ సెల్ చైర్మన్ శ్రీపతి సురేష్,డాక్టర్ నా ఊరి రాంబాబు,ప్రకాశం జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఎస్కే రసూల్, జిల్లా ఐఎన్టీయూసీ అధ్యక్షులు ఉంగరాల శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ వద్దండి మల్లికార్జున రావు ఇతర మండల నాయకులు అధ్యక్షులు యువజన కాంగ్రెస్ నాయకులు, విద్యార్థి విభాగం అధ్యక్షులు, విద్యార్థి విభాగం నాయకులు అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా నాయకులు కొండపిలో విరివిగా పాల్గొని పెద్ద కార్ల ర్యాలీ నిర్వహించారు.

నామినేషన్ల నిబంధన.. చిరు వ్యాపారుల ఇక్కట్లు

విశాలాంధ్ర-కనిగిరి : సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల నిబంధన.. చిరు వ్యాపారులకు ఇక్కట్లు తెచ్చిపెట్టింది. ఎన్నికల్లో ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు వేసే ప్రక్రియ ప్రారంభమైన గురువారం నుంచి ప్రారంభమైన నేపథ్యంలో పోలీసులు కనిగిరిలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఆర్డిఓ కార్యాలయ ప్రాంగణం నుంచి 100 మీటర్ల దూరంలో చెక్ పోస్టు ఏర్పాటు చేసి ట్రాఫిక్ ను మళ్లించడంతో చిరు వ్యాపారులు, వాహనదారులు అవస్థలు పడ్డారు. రోడ్లకు ఇరువైపులా చిన్నపాటి వ్యాపారాలు చేసుకుని జీవనం సాగించే చిరు వ్యాపారుల దుకాణాలు మూసివేయాలని పోలీసులు ఆంక్షలు విధించడంతో చేసేది లేక వ్యాపారాలు దుకాణాలు మూసివేశారు. ఈనెల 25వ తేదీ వరకు నామినేషన్ ప్రక్రియ ముగిసే వరకు ఉదయం 8:30 గంటల నుంచి సాయంకాలం నాలుగు గంటల వరకు దుకాణాలు మూసివేయాలని చిరు వ్యాపారాలకు పోలీసులు తెల్పి చెప్పడంతో చేసేదేమీ లేక వ్యాపారులు వినకుండి పోతున్నారు. ఆర్డీవో కార్యాలయ ప్రాంగణం నుంచి చర్చి వరకు, కోర్టు కొరకు రెండు చెక్ పోస్టులు పెట్టి పోలీసులు చేశారు. పామూరు బస్టాండ్ నుంచి డిపో వైపు వెళ్లే వాహనాలను బిఎస్ఎన్ఎల్ కార్యాలయం నుంచి పవిత్ర బల్లే దారివైపుకు ట్రాఫిక్‌ను మళ్ళించారు. ట్రాఫిక్ ఆంక్షలు విధించడంతో కొంతమేర వాహనదారులు ఇక్కట్లు పడ్డారు.

కాంగ్రెస్ అభ్యర్థి కొండారెడ్డి నామినేషన్

విశాలాంధ్ర-దర్శి : దర్శి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పుట్లూరి కొండా రెడ్డి నామినేషన్ వేశారు. ఉదయం 11గంటలకు పొదిలి రోడ్డు దద్దలమ్మా దేవాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి పార్టీ నాయకులు కార్యకర్తలు లతో భారీ ర్యాలీ తో గడియారం స్థంభం వద్ద చేరు కున్నారు అనంతరం ఎన్నికల అధికారి కి నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్య క్రమంలో వెన్నపుస పుల్లారెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీలో చేరిన కొండా రమణారెడ్డి

విశాలాంధ్ర-గిద్దలూరు : అర్ధవీడు మండలం బోగోలు పంచాయతీకి చెందిన వార్డు మెంబర్ కొండా రమణారెడ్డి టిడిపిని వీడారు. గురువారం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కుందూరు నాగార్జునరెడ్డి సోదరుడు కుందూరు కృష్ణమోహన్‌రెడ్డి సమక్షంలో మౌలాలి వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువా కప్పి కృష్ణమోహన్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు.

'ఉగ్ర' నామినేషన్‌కి భారీగా తరలిరండి

విశాలాంధ్ర-వెలిగండ్ల : తెలుగుదేశం ఇన్చార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఈ నెల 24న నామినేషన్‌కు భారీగా తరలిరావాలని టిడిపి శ్రేణులకు మాజీ మండల అధ్యక్షులు నియోజక వర్గ తెలుగుదేశం నాయకులు శ్యామల కాశిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని తెలుగుదేశం కార్యాలయంలో మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి అధ్యక్షతన టిడిపి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి యద్దనపూడి సాల్మన్ రాజ్, ఎంపిటిసి చిలకల వెంకటేశ్వరరెడ్డి కొండు విజయ భాస్కర్‌రెడ్డి, మండల టిడిపి అధికార ప్రతినిధి గంజి రాజశేఖర్ రెడ్డి, వెన్న రమణారెడ్డి, బొబ్బ భూపాల్ రెడ్డి, చందా బాలకాశిరెడ్డి పాల్గొన్నారు.

విజయ్ కుమార్‌ను కలిసిన టీడీపీ నాయకులు బీవీ ప్రసాద్

విశాలాంధ్ర-సంతనూతలపాడు : మండలంలోని ఎనికపాడు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు మాజీ సర్పంచ్ బివి ప్రసాద్‌తో పాటు పలువురు టిడిపి నాయకులు గురువారం టిడిపి ఎన్ డిఎ అభ్యర్థి బిఎన్ విజయ్ కుమార్‌ను తన కార్యాలయం నందు మర్యాద పూర్వకముగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ టిడిపి గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కలసికట్టుగా పనిచేసి గెలుపునకు కృషి చేయాలని కోరారు, కలిసినవారు టిడిపి నాయకులు కట్టా సుబ్బారావు విక్రం కోటయ్య విక్రం రాఘవ గణేష్ చిన్న రాఘవ వెంకటరావు శ్రీనివాసరావు వీరనారాయణ, సుబ్బారావు శ్రీ హరి వెంకటరావు రాజు మాలాద్రి నరసింహ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ గుర్తుపై ఓటు వేయండి, అశోక్ రెడ్డిని గెలిపించండి

విశాలాంధ్ర-గిద్దలూరు : నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిల ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా వారి సతీమణి పుష్పలీల గిద్దలూరు పట్టణంలోని 3వ వార్డులో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి మ్యానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు.

వైసీపీలోకి చేరికలు

విశాలాంధ్ర-గిద్దలూరు : గిద్దలూరు నియోజకవర్గంలోని గిద్దలూరు మండలం, తిమ్మాపురం పంచాయతీ పరిధిలోని తిమ్మా పురం గ్రామానికి చెందిన అట్లా వారి ఫ్యామిలీస్ మొత్తం గురువారం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కుందురు నాగార్జునరెడ్డి మామ కంభం మాజీ శాసన సభ్యులు ఉడుముల శ్రీనివాసరెడ్డి, గిద్దలూరు ఎంపీపీ భర్త మాజీ ఎంపీపీ కడప వంశీధర్ రెడ్డి, బొర్రా కృష్ణారెడ్డి సమక్షంలో వైసీపీలో చేరారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఉడుముల శ్రీనివాసరెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు.

బూచేపల్లి నామినేషన్‌కు తరలిన వైసీపీ శ్రేణులు

విశాలాంధ్ర-దొనకొండ: దర్శి నియోజకవర్గం వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డా.బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఎన్నికల నామినేషన్‌కు మండలం నుంచి వైసీపీ శ్రేణులు భారీగా తరలి వెళ్ళారు. 190 వాహనాలు, 2 బస్సులు, 500 ద్విచక్ర వాహనాలలో సుమారు 5 వేల మంది దర్శికి తరలి వెళ్ళారు. భారీగా విచ్చేసిన ప్రజానీకానికి వేసవిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక సౌకర్యాలు, భోజనాలను ఏర్పాటు చేశారు. 20 ఏళ్ళుగా పదవిలో ఉన్నా లేకున్నా బూచేపల్లి కుటుంబం చేసిన సేవలు మరింతగా విస్తరించాలంటే శివన్నను గెలిపించుకుంటామంటూ వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తెలిపారు.

నేడు డోలా బాల వీరాంజనేయస్వామి నామినేషన్

- భారీ ర్యాలీకి ఏర్పాట్లు చేసిన సత్య
- ఇప్పటికే ప్రచారంలో దూసుకుపోతున్న టీడీపీ
- టీడీపీలోకి వైసీపీ నుంచి వస్తున్న వలసలు
- చక్రం తిప్పుతున్న దామచర్ల సత్య

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : కొండేపీ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి డోలా బాల వీరాంజనేయస్వామి ప్రచారంలో దూసుకు పోతున్నారు. నేడు కొండేపీ తహశీల్దార్ కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు స్వామి నామినేషన్ దాఖలు చేయనున్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్న డోలా బాలవీరాంజనేయస్వామి నామినేషన్ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యువ నాయకులు దామచర్ల సత్య ఏర్పాట్లను దగ్గరుండి చూసుకుంటున్నారు. ఉదయం 9 గంటల నుంచి ఒంగోలు నుంచి నేరుగా వల్లూరమ్మ దేవస్థానం చేరుకొని అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉదయం 11 గంటలకు టంగుటూరు టోల్‌ప్లాజా వద్దకు చేరుకుంటారు. అక్కడ దివంగత మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు, ఎన్టీ రామారావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తారు. అక్కడి నుంచి మధ్యాహ్నం ఉప్పలపాడుకు చేరుకుంటారు. మధ్యాహ్నం 1 గంట నుంచి భారీ ర్యాలీతో కొండేపీ తహశీల్దారు కార్యాలయంలో నామినేషన్ స్వామి దాఖలు చేయనున్నారు. అనంతరం భారీ బహిరంగసభ నిర్వహించనున్నారు. దామచర్ల సత్య అన్ని దగ్గరుండి చూసుకుంటున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో డోలా వీరాంజనేయ స్వామిని రెండు దఫాలు ఎమ్మెల్యేగా గెలిపించిన ఘన కీర్తిని సత్య మూటకట్టుకున్నారు. మరోసారి స్వామిని గెలిపించి హ్యాట్రిక్ కొట్టాలని సత్య సిద్ధమయ్యారు. దీనికి సంబంధించి కొన్ని సంవత్సరాలుగా గ్రామస్థాయి నుంచి తెలుగుదేశం పార్టీని బలోపేతం చేసుకుంటూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల మనిషిగా గుర్తింపు పొందారు. సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడే కొద్ది వైసీపీకి చెందిన ద్వితీయ, తృతీయ శ్రేణి నేతలతో పాటు జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచులను టీడీపీలోకి మలుచుకునేందుకు ఎత్తుకు పై ఎత్తులు వేసి విజయం సాధించారు. శింగరాయకొండ, మర్రిపూడి, కొండేపి మండలాల్లో వైసీపీకి చెందిన ముఖ్య నేతలను వైసీపీ అనుచరులను తెలుగుదేశం పార్టీలో అనేకమంది చేరే విధంగా దామచర్ల సత్య సఫలీ కృతులయ్యారు. ఒకపక్క ఇంటింటికి తిరిగి స్వామి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా మరోపక్క సత్య వార్డు స్థాయి నుంచి సత్య చక్రం తిప్పుతున్నాడు. మొత్తం మీద కొండేపీ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీలో దామచర్ల సత్య మార్క్ కన్పించే విధంగా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తూ సత్తా చాటుతున్నాడు.

దశాబ్దాలుగా రాజకీయంలో ఉన్నాం..

దర్శి టీడీపీ అభ్యర్థి గొట్టపాటి లక్ష్మి

విశాలాంధ్ర-కురిచేడు : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో దరిశి నియోజకవర్గానికి తెలుగుదేశం అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి ఎన్నికల ప్రచార నిమిత్తం మొదటిసారిగా గురువారం కురిచేడుకు వచ్చారు. తెలుగుదేశం పార్టీ నాయకులు అభిమానులు కార్యకర్తలు గొట్టిపాటి లక్ష్మీ అభిమానులు జనసేన పార్టీ నాయకులు బిజెపి పార్టీ కార్యకర్తలు అందరూ దర్శి రోడ్డులోని బ్రహ్మంగారి మఠం వద్దకు చేరుకొని గొట్టిపాటి లక్ష్మికి అఖండ స్వాగతం పలికి గజమాలతో సత్కరించి అనంతరం బ్రహ్మంగారి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించి అక్కడ నుండి ర్యాలీగా డప్పులు వాయిద్యాలతో బయలుదేరి అయ్యప్ప స్వామి గుడిలో పూజలు చేసి అక్కడి నుండి చైతన్య రథం పై ఊరేగింపుగా ప్రధాన కూడలికి చేరుకొన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీని కార్యకర్తలు తమ భుజస్కంధాలపై మోస్తున్నారని మా కుటుంబీకులు దశాబ్దల కాలము నుండి రాజకీయాల్లో ఉన్నారని మా తాతగారైన గొట్టిపాటి నరసయ్య మా బాబాయి గొట్టిపాటి రవికుమార్ ప్రజలకు సేవ చేస్తూ ఉన్నారన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎస్‌కె సైదా

విశాలాంధ్ర-మార్కాపురం : మార్కాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా రాష్ట్ర పీసీసీ అధికార ప్రతినిధి ఎస్‌కె సైదా సీటు దక్కించుకున్నారు. ఈయన 2019 ఎన్నికల్లో మార్కాపురం నియోజకవర్గం నుంచి ఇదే పార్టీ నుండి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల చేతుల మీదుగా గురువారం ఎస్‌కె సైదా కాంగ్రెస్ పార్టీ బీఫారం అందుకున్నారు. మే 13న జరగబోయే ఎన్నికల్లో ఇండియా కూటమి తరపున పోటీ చేస్తున్న తనను గెలిపించాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. పశ్చిమ ప్రకాశాన్ని మార్కాపురం జిల్లాగా ఏర్పాటు చేయాలని పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులను పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ ఇతర రాజకీయ పార్టీలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టిందని సైదా అన్నారు.

ఉగ్ర నరసింహారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : కనిగిరి నియోజకవర్గ ఎన్డీఏ కూ టమి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశానుసారం శంఖారావం - సూపర్ సిక్స్ పథకాలను మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో హాజీపురం గ్రామంలో క్యాలెండర్లు పంపిణీ చేసి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి ఎన్డీఏ కూటమి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఒంగోలు పార్లమెంట్ ఎన్డీఏ కూటమి తెలుగుదేశం పార్టీ ఎంపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులురెడ్డి సైకిల్ గుర్తు పై ఓటు వేసి అత్యధిక భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు తెలియజేశారు. మండల తెలుగుదేశం పార్టీ నాయకులు టీడీపీ మాజీ మండల పార్టీ అధ్యక్షులు క్లస్టర్ ఇంచార్జ్ గాయం తిరుపతిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మురహరి నరసయ్య, ఎంపీటీసీ ఉడుముల వెంకట సుబ్బారెడ్డి,గాయం రామిరెడ్డి, పాల్గొన్నారు.

జోరుమీదున్న సైకిల్

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని తూర్పు కోడిగుడ్లపాడులో గురువారం 28 కుటుంబాలు వైసీపీని వీడి సర్పంచ్ దారపనేని కొండబాబు ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ రాజేశ్వరరావు, పంచాయతీ వార్డు మెంబర్లు నరసింహారావు, తిరువీధి వెంకటస్వామి, అద్దంకి నాగేశ్వరరావు టిడిపి అభ్యర్థి డాక్టర్ ముక్కుఉగ్ర నరసింహారెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఉగ్ర నరసింహారెడ్డి కండవలు కప్పి పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు. ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యముగా అధికారం ఉన్నా లేకపోయినా పనిచేస్తున్నాన్నారు. మే 13న జరుగు ఎన్నికల్లో గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళిక బద్ధముగా పాటు పడతానన్నారు. పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్, త్రిబుల్ ఐటీ నిమ్జ్ తదితర సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. నాకు ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులు రెడ్డిలకు సైకిల్ గుర్తుపై ఓటు వేయాలన్నారు.

బాపట్లలో సినిమా స్టూడియో ఏర్పాటు చేస్తాం

◈ గీతాంజలి సినిమా హిట్ సంతోషానిచ్చింది
◈ వ్యవస్థ చరిత్రలో నిలిచిపోవడం ఖాయం
◈ ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : గీతాంజలి మళ్లీ వచ్చింది సినిమా హిట్ అవ్వటం తనకి ఎంతో సంతోషమని ఆ చిత్ర సమర్పకులు, ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్ తెలిపారు. గురువారం పట్టణంలోని కోనా చాంబర్స్‌లో కోనా వెంకట్ విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీతాంజలి మళ్లీ వచ్చింది అనే సినిమా కొత్త దర్శకులు, కొత్త టెక్నీషియన్స్‌తో తీసిన సినిమా అని ఆ సినిమా విజయవంతం అవ్వటం పట్ల చిత్ర పరిశ్రమకు చాలామంది కొత్తవారిని పరిచయం చేశాననే సంతృప్తి తనకు ఉందన్నారు. ఇప్పటికీ సినిమా విడుదలై వారం రోజులైన ఇంకా విజయవంతంగా ప్రదర్శించబడుతుందన్నారు. అంతే కాకుండా గీతాంజలి చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. వస్తువుని తయారు చేసే వాడికి తెలుస్తుంది దాని విలువ అని సినిమా టికెట్ల ధరను నిర్ణయించడానికి ప్రభుత్వానికి జోక్యం సమంజసం కాదన్నారు. సినిమా టికెట్ల ధరల విషయంలో సరైన పద్ధతి కాదని పేర్ని నానికి ఫోన్ చేసి సినీ పరిశ్రమలో జోక్యం చేసుకోవద్దని చెప్పడం కూడా జరిగిందన్నారు. బాపట్లలో సినిమా స్టూడియో ఏర్పాటు చేయాలనుకున్న కానీ పరిస్థులు అనుకూలించలేదన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల అనంతరం ఏ పార్టీ అధికారాన్ని చేపట్టిన ప్రతిపక్ష అధికార పక్ష పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించి ప్రతి ఒక్కరిని ఒప్పించి సినీ స్టూడియోని నిర్మిస్తానన్నారు. సినీ స్టూడియో బాపట్లలో నిర్మించడంతో యువతకు 500 మందికి ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. సినీ స్టూడియోని వైజాగ్‌లో ఏర్పాటు చేయమని అక్కడి ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అడిగినా నా జన్మభూమి బాపట్ల లోనే స్టూడియో ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నానన్నారు. గత 25 ఏళ్లుగా మా కుటుంబాన్ని ఆదరించిన నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోవాలనేది నా కోరికన్నారు. బాపట్లలో రోడ్లను చూస్తుంటే బాపట్లలో ఉన్నామా బంజారాహిల్స్‌లో ఉన్నామా అనిపిస్తుందన్నారు. భారతదేశంలోని ఇలాంటి అభివృద్ధి, సంక్షేమం ఏ రాష్ట్రంలో లేదన్నారు. రాష్ట్రంలో ఇప్పుడు ఏ నోట చూసినా ఒకటే మాట ఏపీ నీడ్స్ జగన్ గత ఐదేళ్లలో రాష్ట్రాన్ని అద్భుతంగా అభివృద్ధి చేసిన నాయకుడు జగన్మోహన్ రెడ్డి అన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ, వాలంటీర్ వ్యవస్థ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కొద్దిరోజుల క్రితం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రచారాలలో కూడా టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా తరువాత జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలన్నీ కొనసాగిస్తామన్నారు. సినిమా పరిశ్రమలో ఉన్నవాళ్లు రాజకీయాల గురించి మాట్లాడం మంచిది కాదన్నారు. కానీ ఆయన చేసినటువంటి మంచిని తెలపడంలో తప్పు లేదన్నారు. అలాగే రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమల్లో మెడికల్ కాలేజీలు, ఫిషింగ్ హార్బర్లు, పోర్ట్‌లు అన్ని నిర్మాణ దశల్లో పూర్తి కావస్తున్నా యన్నారు. తన సొంత నిధులతో బాపట్ల నియోజకవర్గంలో కొంతమేరకు అభివృద్ధి చేస్తున్నారు. సరైన నాయకుడిని ఎన్నుకునే సమయం ఆసన్నమైందని అభివృద్ధిని చూసి నియోజకవర్గ ప్రజలు ఓటేయాలని కోరారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో బాపట్లలో తన బాబాయి కోన రఘుపతిని మరొకసారి గెలిపించి బాపట్ల అభివృద్ధికి సహకరించాలని కోరారు. అదేవిధంగా రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి పరిపాలన అత్యంత అద్భుతంగా సాగిస్తున్నారని మరొకసారి ఆయనను ముఖ్యమంత్రిగా చేసి గెలిపించాలని కోరారు.

వలంటీర్లు రాజీనామా

విశాలాంధ్ర - బల్లికురవ : మండల పరిధిలోని గుంటుపల్లి పంచాయతీలోని 11 మంది వాలంటీర్లు ముక్తేశ్వరం పంచాయతీ పరిధిలోని 17 మంది వాలంటీర్లు తమ విధులకు గురువారం రాజీనామా చేసి వారి యొక్క రాజీనామా పత్రాలను అధికారులకు అందించారు. ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ అద్దంకి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పానెం చిన్న హనిమిరెడ్డి బాపట్ల పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి నందిగామ సురేష్ మద్దతుగా నిలిచేందుకు వాలంటీర్లుగా రాజీనామా చేస్తున్నామన్నారు. మరలా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేశాక తాము వాలంటీర్లుగా విధుల్లో చేరి ప్రజలకు సేవలందిస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్షాలు వాలంటీర్లపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో వాలంటీర్లను విధుల నుండి పక్కన పెట్టాలని ప్రభుత్వానికి ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేయడంతో వాలంటీర్లు మనస్థాపానికి గురై ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

కరణం కుటుంబ సభ్యుల ప్రచారం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల నియోజకవర్గంలో చీరాల, వేటపాలెం మండలాలు ఉన్నాయి. రెండు లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు. రానున్న ఎన్నికలలో ప్రతి ఓటు కీలకం కావడంతో అభ్యర్థులు వారిని కలవడానికి ప్రతి ఒక్క అవకాశాన్ని ఉపయోగించు కుంటున్నారు. చీరాల నియోజక వర్గ వైకాపా అభ్యర్థి కరణం వెంకటేష్ నియోజకవర్గంలో తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆయనకు బాసటగా ఆయన కుటుంబ సభ్యులు నియోజక వర్గంలో తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. వెంకటేష్ తండ్రి శాసన సభ్యులు కరణం బలరామ కృష్ణమూర్తి తన పూర్వ పరిచయాలు వినియోగించుకుంటూ నియోజకవర్గంలో ఆత్మీయ సమావేశాలు నిర్వహించి తనయుని గెలుపు కోసం కృషి చేస్తున్నారు. వెంకటేష్ సతీమణి గీత, సమీప బంధువులు సుధారాణి, శాంతి ప్రియ తదితరులు పట్టణంలోని వార్డులలో పర్యటిస్తూ కౌన్సిలర్లను, నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజలను కలిసి ఓట్లను అభ్యర్థిస్తున్నారు. సంక్షేమ పాలన కోసం మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా చేయాలని, చీరాలలో కరణం వెంకటేష్ ను గెలిపించాలని కోరుతున్నారు.

దొంగల దెబ్బకు రైతులకు ఇబ్బందులు

విశాలాంధ్ర - యద్దనపూడి : ఆరుగాలం కష్టించి పనిచేసి పంటలను సాగు చేసిన రైతులకు దొంగల దెబ్బ కంటిమీద కూనుకు లేకుండా చేస్తుంది. యద్దనపూడి మండలంలోని గన్నవరం గ్రామంలో నిన్న అర్ధరాత్రి సమయంలో పత్తిపాటి రాంబాబు అనే రైతు పొలంలో పొగాకు తాళ్ళను దొంగలు దొంగిలిస్తున్న సంఘటన చోటు చేసుకుంది. రైతులకు తెలిపిన వివరాలు ప్రకారం గన్నవరం, పూనూరు రహదారిలో అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఒక వ్యక్తి ట్రాక్టర్ నడుపుకుంటూ పూనూరు వైపు వెళ్తుండగా రాంబాబు పొలం వద్ద ఒక ఆటో ఆగి ఉండటం గుర్తించాడు. ఈ సమయంలో ఇక్కడ ఆటో ఏమిటి అని పరిశీలించగా, ఐదుగురు వ్యక్తులు పొలంలో నుంచి పొగాకు తాళ్ళను మోస్తూ కనిపించారు. ట్రాక్టర్ వ్యక్తిగా అనుమానం వచ్చి గన్నవరం గ్రామంలోని రైతులకు సమాచారం అందించాడు. గన్నవరం రైతులు పొలం వద్దకు రావటం గమనించిన దుండగులు ఆటోతో పరారైనారు. కొద్దిరోజుల క్రితం చిమటవారిపాలెం గ్రామంలో కూడా ఇదే సంఘటన జరగటంతో ఇరువురు రైతులు యద్దనపూడి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఎస్సై జీవి చౌదరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

- చీరాల నియోజకవర్గ ఎన్డీఏ అభ్యర్థి మద్దులూరి మాల కొండయ్య

విశాలాంధ్ర - చీరాల రూరల్ : తన విజయం కోసం కృషి చేస్తున్న తెదేపా, భాజపా, జనసేన పార్టీల కార్యకర్తలకు ఇబ్బంది కలిగేలా ఎవరైనా వ్యవహరిస్తే వారి తాట తీస్తానని చీరాల నియోజకవర్గ ఎన్డీఏ అభ్యర్థి మద్దులూరి మాల కొండయ్య అన్నారు. తెదేపా కార్యాలయంలో జరిగిన మూడు పార్టీల నాయకుల, కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ అన్నీ వదులుకొని వచ్చానని అవసరమైతే కార్యకర్తల కోసం ప్రాణాలైనా ఇస్తానన్నారు. 1996లో ఐదుగురు దళితులకు శిరోముండనం చేసి తోట త్రిమూర్తులు అవమానించారన్నారు. దళిత ద్రోహులకు జగన్ రెడ్డి ఆశ్రయం ఇస్తున్నారన్నారు. న్యాయం జరగడంలో ఆలస్యం అవుతుందేమో కానీ న్యాయమే చివరకు గెలుస్తుందన్నారు. న్యాయ స్థానంలో త్రిమూర్తులుకు 18 నెలల జైలు శిక్ష పడటం హర్షణీయం అన్నారు. వైఎస్ఆర్సీపీ దళిత ద్రోహుల పార్టీ అని మరోసారి రుజువు అయ్యిందన్నారు. నా ఎస్సీలు, నా ఎస్టీలు అంటూ ప్రతి వేదికపై ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి వారిపై ఎనలేని ప్రేమ ఒలకబోస్తున్నారని, నాడు దళితుడిని చంపిన అనంత బాబును పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లే చేసి మళ్లీ పార్టీలోకి తెచ్చుకున్నాడని గుర్తుచేశారు. జగన్ రెడ్డి పాలనలో దళితులపై దాడులు ఎక్కువ అయ్యాయని. ఎస్సీలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. నియోజకవర్గంలోని చీరాల పట్టణంలో పిట్టువారిపాలెంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. తెదేపా మినీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. బీసీ డిక్లరేషన్ ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. తెదేపాను అధికారంలోకి తీసుకు రావాలని కోరారు. బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి తెన్నేటి కృష్ణ ప్రసాద్ సతీమణి శిరీష, కొండయ్య తనయ శివనారాయణ దేవి, సజ్జ హేమలతలు నియోజకవర్గంలోని ప్రముఖ దేవాలయాలు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. తొలిసారి ఓటు హక్కు పొందిన చీరాల పట్టణానికి చెందిన యువత అంగిరేకుల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తెదేపా కార్యాలయంలో కొండయ్య మద్దతు తెలిపారు. వారికి యువ నాయకులు ఎం.గౌరి అమర్‌నాథ్, మహేంద్రనాథ్‌లు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో తెదేపా, భాజపా, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి : కాకర్ల

విశాలాంధ్ర - యద్దనపూడి : చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి అని టీడీపీ నాయకులు కర్లపూడి నారాయణస్వామి అన్నారు. మండలంలోని, చింతపల్లిపాడు గ్రామంలో గ్రామాలలో టీడీపీ నాయకులు కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గం బాపట్ల పార్లమెంటరీ నియోజకవర్గ తెలుగుదేశం అభ్యర్థులు ఏలూరి సాంబశివరావు, టి.కృష్ణ ప్రసాద్‌లను మంచి మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశంపార్టీ ప్రవేశపెట్టిన పథకాలు వృద్ధులకు 4000 పెన్షన్, ప్రతి మహిళకు 1500 వికలాంగులకు 6000 పెన్షన్, వంటి సూపర్ సిక్స్ పథకాలను చెబుతూ ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను కలుస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జంపని అంకమ్మ, కర్లపూడి నారాయణస్వామి, జంపని పెద్దబ్బాయి, జంపాని నాగేశ్వరరావు, నారాయణ, జంపని మోహన్ రావు, మండల ఆంజనేయులు, గోరంట్ల శ్రీనివాసరావు, బొప్పూడి శ్రీనివాసరావు తదితర నాయకులు ప్రచారంలో పాల్గొన్నారు.

పర్చూరులో బీఎస్పీ అభ్యర్థి 'తమ్ములూరి' నామినేషన్

విశాలాంధ్ర-పర్చూరు: పర్చూరు నియోజకవర్గంలోని మార్టూరు గ్రామానికి చెందిన తమ్ములూరి వెంకటరత్నం గురువారం బీఎస్పీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి గంధం రవీందర్‌కు అందించారు. ఈనెల 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తామని ఆర్ఓ రవీందర్ తెలిపారు. ఏఈఆర్ఓలు సుబ్బయ్య, నాగరాజు, సంధ్యశ్రీ, ప్రమీల, మెహర్‌బాబు, ఫణీంద్రబాబు, ఎన్నికల డీటీ పి.సూర్యనారాయణ ఉన్నారు.

నామినేషన్‌కు తరలిన వైసీపీ శ్రేణులు

విశాలాంధ్ర-ముండ్లమూరు : దర్శి అసెంబ్లీ స్థానానికి దర్శి మాజీ ఎమ్మెల్యే, దర్శి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్న సందర్భంగా వైకాపా శ్రేణులు మండలం నుండి గురువారం భారీగా తరలి వెళ్లారు. మండలంలోని ముండ్లమూరు, పసుపు గుళ్ళు, ఉల్లగల్లు, పులిపాడు, మారెళ్ళ, నాయుడుపాలెం, తమ్మలూరు, ఉమామహేశ్వరపురం, పూరి మెట్ల ,భీమవరం,ఈదర,కొమ్మవరం, వేముల, జమ్మలమడక, మక్కినేని వారి పాలెం, నూజిలపల్లి, బట్లపల్లి, సుంకర వారిపాలెం, పోలవరం, శంకరాపురం, వేంపాడు. చింతలపూడి. వేముల బండ, తదితర గ్రామాల నుండి వైకాపా నాయకులు ప్రత్యేక వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. ఎంపీపీ సుంకర సునీత బ్రహ్మానందరెడ్డి, జడ్పిటిసి తాతపూడి మోజెస్ రత్నం రాజు, మాజీ కన్వీనర్ సూది దేవర అంజయ్య, వైస్ ఎంపీపీలు వేముల పద్మావతి జానకి రామయ్య, బంక రమణమ్మ నాగిరెడ్డి, సర్పంచి కందిమల్ల గీతాంజలి, సర్పంచ్‌ల సంఘం జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు చింతా శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ బిజ్జం జ్యోతి కృష్ణారెడ్డి, మేదరమెట్ల కోదండరామయ్య, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల వెంకటేశ్వర రెడ్డి, ఆంజనేయ డైరీ ఎండి ఎనుముల శ్రీనివాసరెడ్డి, గూడాల లింగారెడ్డి, సర్పంచి గోపన బోయిన శ్రీనివాసరావు, ఇరుగుల కొండారెడ్డి, అబ్బాన అంజిరెడ్డి, దుగ్గినేని వెంకటేష్ బాబు, తేలుకుట్ల బ్రహ్మం, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదారికట్లలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని పెదారికట్ల గ్రామంలో గొట్లగట్టు వైద్యాధికారి బి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 55 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య ఆశా కార్యకర్తలు ఇంటింటా తిరిగి ఐదుగురు జ్వర పీడితులను గుర్తించి వారికి రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పృథ్వీరాజ్ మాట్లాడుతూ ఎండలు అధిక ఉష్ణోగ్రతలు ఉన్న నేపథ్యంలో వడదెబ్బ పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. హెల్త్ సూపర్వైజర్ జే వెంకటేశ్వర్లు హెచ్‌వి పి భారతి ఆరోగ్య కార్యకర్త ధనలక్ష్మి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న జై సింహారెడ్డి

విశాలాంధ్ర-హనుమంతునిపాడు : మండల పరిధిలోని నందనవనం పంచాయతీలో గల గముల్లపాలెం గ్రామంలో సూరగాని శ్రీరాములు వివాహానికి మరియు అదే గ్రామంలో సూరిశెట్టి రమణయ్య వివాహానికి మరియు అదే పంచాయతీ కొత్తూరు గ్రామానికి చెందిన కండే ఆదిలక్ష్మి వివాహ కార్యక్రమానికి కనిగిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి తనయుడు ముక్కు జై సింహారెడ్డి,మరియు టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు సానికొమ్ము తిరుపతిరెడ్డి, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి మువ్వా రంగసాయి యాదవ్,గాయం రామిరెడ్డి, చీకటి వెంకట సుబ్బయ్య, పెంచికల రామకృష్ణ,బాల నారాయణ యాదవ్,సుమిత్ర తిరుపతిరెడ్డిలు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.మరియు వీరితో పాటు తదితర టీడీపీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎస్క్రో ద్వారా వేతనాలు చెల్లించాలి



విశాలాంధ్ర-మార్కాపురం : విద్యుత్ సంస్థలో 20 సంవత్సరాల నుంచి మీటర్ రీడింగ్ తీస్తున్న వారికి ఎస్క్రో ద్వారా వేతనాలు చెల్లించాలని, అలాగే 10+2 పని దినాలను పెంచాలని మీటర్ రీడర్స్ యూనియన్ ఎఐటీయుసి సీనియర్ నాయకులు అందే నాసరయ్య జిల్లా కార్యదర్శి ఎస్ కె.ఖాసీం లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు మిటర్ రిడర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మీటర్ రీడర్స్ నాయకులు జిల్లా ఉపాధ్యక్షుడు బొప్పరాజు నారాయణ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ బాషా, టి.సతీష్ కుమార్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- యర్రగొండపాలెం నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : ఎర్రగొండపాలెం నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా నేను పని చేస్తానని ఎర్రగొండపాలెం నియోజకవర్గ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ తెలిపారు. గురువారం మండలంలోని రామచంద్ర కోట, కడప రాజు పల్లి, అసనాబాదా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. దోర్నాల మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో ఈ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మహిళలు నాయకులు హారతులిచ్చి, పూలవర్షంతో, వాయిద్యాలు వాయిస్తూ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన అన్ని వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పరిపాలన తీసుకువచ్చి జవాబు దారితనాన్ని పెంచిన ఏకైక ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి అని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని జగనన్న ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. అలాగే అన్ని వర్గాల ప్రజలకు నవరత్నాలు తిరిగి కొనసాగాలంటే మరలా తిరిగి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కావాలని తెలియజేశారు. మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, ఎంపీపీ భర్త, బీసీ సంఘం నాయకుడు గుమ్మా పద్మజ యల్లేష్, మాజీ జెడ్పిటిసి అమ్మిరెడ్డి రామిరెడ్డి, రాష్ట్ర మైనార్టీ సెల్ నాయకుడు షేక్ అబ్దుల్ మజీద్, సింగిల్ విండోఅధ్యక్షుడు వెన్న కాశిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ యక్కంటి వెంకటేశ్వర్‌రెడ్డి, బొమ్మలాపురం ఎంపీటీసీ భర్త, పొందుగుల వెంకట్‌రెడ్డి, మరియు కిక్కురి నారాయణరెడ్డి, దోర్నాల సర్పంచ్ చిత్తూరు హారిక, కర్ర మల్లారెడ్డి, వెన్న సత్యనారాయణ రెడ్డి, మాజీ ఎంపీపీ జోగి వెంకట్ నారాయణ, గంట వానీ పల్లి సర్పంచ్ భర్త వెంకటేశ్వర్ రెడ్డి, చింతలచెరువు వెంకట్ రెడ్డి, నూరు బాషా సంఘం డైరెక్టర్ డి కాశింపిరా, జంకెసుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డి, అల్లు రాంభూపాల్ రెడ్డి, యక్కంటివెంకటేశ్వర్ రెడ్డి, చంద్రకాంత్ నాయక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంపూర్ణ విద్యావంతులుగా యువత ఎదగాలి

- ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఆచార్యులు జి సోమశేఖర

విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : స్నాతకోన్నత విద్యలను అభ్యసిస్తేనే యువత సంపూర్ణ విద్యావంతులుగా ఎదిగి విజయాలు సాధిస్తారని ఒంగోలు ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం అడ్మిషన్స్ డైరెక్టర్ ఆచార్య జి. సోమశేఖర అన్నారు. గురువారం ఉదయం స్థానిక శ్రీసాధన డిగ్రీ కళాశాలలో మార్కాపురానికి చెందిన డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు స్నాతకోన్నత విద్యపై జరిగిన ప్రత్యేక అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని ఏకె విశ్వవిద్యాలయం ఈ విద్యాసంవత్సరంలో అందించనున్న వివిధ పీజీ కోర్సులు వాటి ప్రయోజనాలను గురించి విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు. సభాధ్యక్షులు డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ మాట్లాడుతూ స్నాతకోన్నత విద్యను అభ్యసించి యువత విద్యపట్ల సాధికారత సాధించాలని వివరించారు. ఏకె విశ్వవిద్యాలయం సోషల్ వర్క్ విభాగం సహాయక ఆచార్యులు డాక్టర్ ఆర్. శ్రీనివాస్ వర్శిటీ అందించే వివిధ సోషల్ సైన్స్ స్ గ్రూప్ గురించి విద్యార్థులకు వివరించారు. వర్శిటీ కామర్స్ అండ్ మేనేజిమెంట్ విభాగం సహాయక ఆచార్యులు డాక్టర్ విజయ్కుమాల్ కామర్స్, యం.బి.ఏ ఎకనామిక్స్ మరియు ఆక్వాకల్చర్ విభాగం సహాయక ఆచార్యులు డాక్టర్ సురేష్ విశ్వవిద్యాలయం అందిస్తున్న వివిధ పీ.జీ సైన్సు గ్రూప్ గురించి సావధానంగా తెలిపారు. కళాశాల ఉపఆచార్యులు పి.శ్రీధర్ కుమార్ నిర్వహణా సారధ్యంలో నిర్వహించిన ఈ ప్రత్యేక అవగాహనా సదస్సులో ప్రిన్సిపల్ డాక్టర్ మధుసూదన్‌తో పాటు టి.పి.ఓ కె. పవన్ కుమార్, పరిశోధన విభాగం సమన్వయకర్త డాక్టర్ ఎమ్. శేషుకుమార్, గణిత విభాగాధిపతి జె.రాము, వృక్షశాస్త్ర విభాగాధిపతి కె.సోనియా, ఉపన్యాసకురాలు జి. శిరీష, తెలుగు శాఖ విభాగాధిపతి డి. వినోద్, కామర్స్ ఉపన్యాసాలు ఓ ఏడుకొండలు అర్థశాస్త్ర విభాగాధిపతి జి. రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రామసుబ్బమ్మకి ఘన నివాళి

విశాలాంధ్ర-వెలిగండ్ల : ప్రకాశం జిల్లా జడ్పిటిసిల సంఘం అధ్యక్షులు, వెలిగండ్ల జడ్పిటిసి గుంటక తిరుపతిరెడ్డి మాతృమూర్తి గుంటక రామసుబ్బమ్మ దశ దిన కర్మకాండలు మండలంలోని తమ స్వగ్రామైన వెదుళ్ళ చెరువు గ్రామంలో గురువారం నిర్వహించారు. మాజీ మంత్రి ముక్కు కాశి రెడ్డి దంపతులు, మాజీ ఎంపీపీ ముక్కు జయరాం రెడ్డి, జెడ్పిటిసి మడతల కస్తూరి రెడ్డి, ఎంపీపీ రామన మహాలక్ష్మి, మాజీ జెడ్పిటిసి రామన తిరుపతి రెడ్డి, నాగూర్ యాదవ్, జార్జ్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు దేవ సహాయం, సచివాలయ కన్వీనర్ పోల్లా సుబ్రమణ్యం, నియోజకవర్గ నాయకులు కటికల వెంకటరత్నం, సర్పంచి తాతపూడి సురేష్ బాబు, శ్యామల కృష్ణారెడ్డి కటికల రిబ్కా, ఎస్సీ సెల్ అధ్యక్షులు గోన జేమ్స్, దాదా సోమయ్య, పాణ్యం మురళి, మండలంలోని ముఖ్య నాయకులు పార్టీ కార్యకర్తలతో పాల్గొని గుంటక రామసుబ్బమ్మకు నివాళులర్పించి గుంటక తిరుపతిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నూతలపాడు వలంటీర్లు రాజీనామా

విశాలాంధ్ర-పర్చూరు: మండలంలోని నూతలపాడు గ్రామంలో వాలంటీర్ల విధులు నిర్వహిస్తున్న 17 మంది గురువారం రాజీనామా పత్రాలను ఎంపిడిఓ శ్రీనివాసరెడ్డికి అందించారు. అనంతరం వైసీపీ అభ్యర్థి యడం బాలాజీని కలిసి గెలుపునకు కృషిచేస్తామని తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

- పూషడపు కుమారస్వామి

విశాలాంధ్ర - చెరుకుపల్లి : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం 20 సంవత్సరాలు వెనకకు వెళ్ళిందని రేపల్లె టీడీపీ పొలిటికల్ మేనేజర్ పూషడపు కుమారస్వామి అన్నారు.శంఖారావం కార్యక్రమంలో భాగంగా గురువారం మండల పరిధి లోని తూర్పుపాలెం గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వ హించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ చూ సినా అవినీతి రాజ్యమేలుతుంద న్నారు .ఎమ్మెల్యేలు మంత్రులు అంది న కాడికి దోచుకుంటూ రా ష్ట్రాన్ని అధోగతి పాలు చేశార న్నారు.ప్రకృతి వనరులను కూడా వదలకుండా సొమ్ము చేసుకున్న నాయకులు దేశంలో మరి ఎక్కడ ఉండరన్నారు. రాష్ట్రాన్ని చేసి నిరుద్యోగాన్ని పెంచి రాజధాని లేని రాష్ట్రంగా చేసిన ఘనత ఈ ముఖ్యమంత్రికే దక్కు తుంద న్నారు. రాష్ట్రంలో ఒక్క పరిశ్రమలు కూడా తీసుకురాలేక అప్పులు తెచ్చి ప్రజల ఖాతాలో నగదువేస్తూ పెంచిన ధరలతో మరింత సొమ్ము వారి దగ్గర నుంచి గుంజు తున్నారని,ప్రస్తుత రాష్ట్రాన్ని గాడిలో పెట్టాల న్న,రాష్ట్రం తిరిగి జవసత్వాలు పుంజుకొని అభివృద్ధి పదంలో దూసుకు వెళ్లా లంటే కూటమి అభ్యర్థులకే ఓటు వేసి గెలిపించాలన్నారు.మరలా జగన్ మో హన్ రెడ్డి ముఖ్య మంత్రి అయితే రా ష్ట్రం పూర్తిగా అంధకార బంధురమై ప్రజల జీవితాలు రోడ్డున పడతాయన్నారు.కల్లబొల్లి మాటలతో మళ్ళీ మీ ముందుకు వస్తున్న వైసీపీ నాయకులకు ఓటు అనే ఆయుధంతో తగిన బుద్ధి చెప్పాలన్నారు.ఈ కార్య క్రమంలో తెలుగుదేశం రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షులు డివి రాంబాబు, నాగుల పున్నా రావు,ఏనుగుల కోటేశ్వరరావు, చందు, అనిల్, జనసేన నాయకులు మట్టి భాస్కరరావు,బిజెపి నాయకులు కందుల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు దుకాణాలపై కేసు నమోదు

విశాలాంధ్ర - బల్లికురవ : నిత్యావసరాలతో పాటు ఇతర వస్తువులను ప్రజల వద్ద నుండి అధిక ధరలను వసూలు చేస్తే అలాంటి దుకాణాలపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తూనికలు,కొలతల శాఖ ఎస్సై నాగేశ్వరరావు హెచ్చరించారు.గురువారం మండల కేంద్రం అయినా బల్లికురవ నాలుగు రోడ్ల కూడలిలో శీతల పానీయాలు అధిక ధరలకు విక్రయాలు సాగిస్తున్న దుకాణాలపై తూనికలు కొలతల శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు.ఈ సందర్భంగా నాగేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన ధరలను వినియోగదారులకు అందుబాటులో ఉంచాలన్నారు.బల్లికురవలో శీతల పానీయాలు అధిక ధరలకు అమ్ముతున్నట్లు కొనుగోలుదారుడి ఫిర్యాదు మేరకు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించా మన్నారు. నిత్యావసర సరకులతో పాటు ఇతర వస్తువులను ఎవరైనా అధిక ధరలకు అమ్మితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే వినియోగదారులు తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.

కేంద్ర సాయుధ బలగాల కవాతు

విశాలాంధ్ర-ముండ్లమూరు : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ఆదేశాలతో గురువారం పలు ప్రాంతాలలో కేంద్ర సాయుధ బలగాలతో పోలీసులు కవాతు నిర్వహించారు. మండలంలోని వేముల, ఈదర, శంకరాపురం, పోలవరం, గ్రామాలలో పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వి ఆంజనేయులు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రజలలో భరోసా కల్పించేందుకు, ఎటువంటి అల్లర్లుజరగకుండా, ఎన్నికల ప్రశాంతంగా జరిగే విధంగా, శాంతి భద్రతలను కాపాడేందుకు కవాతు నిర్వహించామన్నారు. ఎన్నికల ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని ప్రజ లను ఎస్సై కోరారు. ఎన్నికలలో ప్రజలు ఓటు హక్కును స్వేచ్ఛగా, నిర్భయంగా వినియోగించుకునే విధంగా పోలీసు యంత్రాంగం సహకారం ఎల్లవేళలా ఉంటుందని ఎస్సై పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కోదండసీతారాముల గ్రామోత్సవం

విశాలాంధ్ర-సీఎస్‌పురం : మండలంలోని శీలంవారిపల్లె గ్రామంలో శ్రీ కోదండరామస్వామి దేవస్థానం నందు నిర్వహిస్తున్న 39వ వార్షికోత్సవాల సందర్భంగా బుధవారం రాత్రి శ్రీకోదండ సీతారామ లక్ష్మణ స్వామివార్ల గ్రామోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈసందర్భంగా ముందుగా దేవస్థానంలో పూజలు నిర్వహించి అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టరుమీద పల్లకీనందు స్వామివార్లను ప్రతిష్ఠించి అనంతరం పూజలు నిర్వహించి కర్పూరహారతులు ఇచ్చి మేళతాళాలు బాణసంచా

పేలుళ్ళమధ్య భక్తుల గోవిందా రామనామస్మరణలతో గ్రామంలో అత్యంత వైభవంగా గ్రామోత్సవం నిర్వహించి హారతులు ఇచ్చారు. ఈసందర్భంగా గ్రామోత్సవంలో కనిగిరి మాజీఎమ్మెల్యే కదిరిబాబురావు దంపతులు కుటుంబసభ్యులు గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొని గ్రామోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించారు. అదేవిధంగా గురువారం ఉదయం స్వామివార్లకు గ్రామంలో వసంతోత్సవం నిర్వహించి తదుపరి అలంకరణచేసి పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించి వనమహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈపూజాకార్యక్రమాల్లో దేవస్థానం కమిటీపెద్దలు గ్రామస్థులు పాల్గొన్నారు.

తలసేమియా వ్యాధిగ్రస్థురాలికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : అఖండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తల సేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారి కల్వరికి ఆర్థిక సహాయం చేయడం సంతోషదాయంగా ఉందని అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్,సెటిలర్ కళ్యం హరినాద్ రెడ్డి, ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు మోహన్ గౌడ్ తెలిపారు.పట్టణంలోని మార్కెట్ యార్డ్ వద్ద గల తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తల సేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారి కుటుంబ సభ్యులకు ఫౌండేషన్ నిర్వాహకులు రూ.10,000 ఆర్థిక సాయం అందజేశారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు జీవీఎల్ మోహన్ గౌడ్ మాట్లాడుతూ తల సేమియా వ్యాధితో బాధపడుతూ వైద్య ఖర్చులకోసం ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని చిన్నారికి ఆర్థిక సాయం చేయాలని కోరినరాన్నారు.వెంటనే ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్ వెంటనే స్పందించి చిన్నారికి ఆర్థిక సహాయం చేయడం ఆనందంగా ఉన్నాన్నారు.రానున్న కాలంలో అఖండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సేవ కార్యక్రమాలను చేపడతామని, అఖండ ఫౌండేషన్‌కి

సహకరిస్తున్న సభ్యులందరూ ఆరోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన కోరారు.చిన్నారి కల్వరి పుట్టిన మూడు నెలల నుంచి ఈ వ్యాధితో బాధప డుతుందని ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తం మార్చా ల్సి వస్తుందని ఆమె తండ్రి రవీంద్రారెడ్డి తెలిపారు. మందులు ఖర్చు అధికంగా అవుతుందని గతంలో ప్రభుత్వం మందులు ఉచితంగా అందించే వారని కరోనా దగ్గర నుండి ప్రభుత్వం నుండి ఎటువంటి సహకారం అందటం లేదని ఆయన తెలిపారు.చిన్నారి కల్వరికి ప్రస్తుతం 11 సంవత్సరాలు ఉందని,అయితే రానున్న సంవత్సరంలో ఆపరేషన్ చేయించవలసి ఉందని తెలియజేశారు. అఖండ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఇండిపెండెంట్ అభ్యర్థిగా మంచ మినా నామినేషన్ దాఖలు

విశాలాంధ్ర-దర్శి : దర్శి నియోజకవర్గ శాసనసభ ఇండిపెండెంట్ అభ్యర్థిగా మంచ మినా గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావుకు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఆమె వెంట అభిమానులు పాల్గొన్నారు.

గొట్టిపాటి లక్ష్మికి ఎమ్మార్పీఎస్ మద్దతు

విశాలాంధ్ర-దర్శి : తెలుగుదేశం పార్టీ గెలుపు మాదిగలకు మలుపు అని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు ముప్పంగి నాగరాజు మాదిగ అన్నారు. గురువారం ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ కడియాలను మర్యాదపూర్వకంగా కలిశారు. దర్శి నియోజకవర్గంలో కొట్టిపాటి లక్ష్మికి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. దర్శి ఎమ్మెల్యే అభ్యర్థిని గెలుపుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తొరటి ఆనంద్ మాదిగ, జిల్లా కార్యదర్శి బుట్టే వెంకట్రావు మాదిగ, మార్కు యోగయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి తిరోగమనం

విశాలాంధ్ర-టంగుటూరు : వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధిలో ఐదు సంవత్సరాలు తిరోగమన పాలైందని టంగుటూరు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరోపించారు. టంగుటూరులోని స్థానిక పోతల చెంచయ్య వెస్ట్ కాలనీలో గురువారం సాయంత్రం టంగుటూరు మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికి శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి సూపర్ సిక్స్ పథకాల గురించి తెలియజేస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కు రాజధాని లేని రాష్ట్రంగా చేసిన ఘనత వైసీపీకే దక్కుతుందని అన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ టంగుటూరు మండల అధ్యక్షులు కామని విజయ్ కుమార్, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ బెల్లం జయంతి బాబు, సర్పంచ్ మద్దిరాల మమత, రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు ధర్నాసి బ్రహ్మానందం, జక్కుల శ్రీను మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాపట్లలో ఆరుగురు నామినేషన్ దాఖలు

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల అసెంబ్లీ స్థానానికి ఆ ఆరుగురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసినట్లు ఎన్నికల రిట ర్నింగ్ అధికారి చామకూరి శ్రీధర్ తెలిపారు.స్వతంత్ర అభ్యర్థిగా కటికల శివభాగ్యరావు, వైసీపీ అభ్యర్థిగా కోన రఘుపతి, కోన రమాదేవి,పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా దేవరకొండ రాజేశ్వరరావు, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా రాజారావు గుదే, స్వతంత్ర అభ్యర్థిగా దొనేపాటి షాలిని నామినేషన్లు అందజేసినట్లు తెలిపారు.

కరణం వెంకటేష్‌ను గెలిపించుకుంటాం

విశాలాంధ్ర - చీరాల : రానున్న ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్‌ను గెలిపించుకుంటానని పలువురు యువత వెంకటేష్‌ను ఆయన స్వగృహంలో కలిసి చెప్పారు. గ్రామాలు మునిసిపల్ వార్డులలో యువకులు స్వచ్ఛందంగా కరణం వెంకటేష్‌ను కలుస్తున్నారు.మిగతా రాజకీయ పార్టీల వ్యూహాలు ఎలా ఉన్నా కరణం వెంకటేష్ వ్యూహాలతో ముందుకు వెళు తున్నారు.చీరాల రాజకీయంలో త్రిముఖ పోటీ ఉండడంతో చీరాల మాజీ శాసన సభ్యులు కరణం బలరామ కృష్ణమూర్తి తనదైన శైలిలో గ్రామాలలో నాయకులను ఒకతాటిపైకి తెస్తుంటే,యువనేతగా కరణం వెంకటేష్ ఆత్మీయ సమావేశాలు నిర్వహించి చీరాల అభివృద్ధికి కలసికట్టుగా కృషి చేద్దామంటూ యువతను ఒకతాటిపైకి తెస్తున్నారు.మరో వైపు భర్తకు తోడుగా ఆయన సతీమణి సైతం వార్డులలో తిరుగుతూ రాష్ట్రాభివృద్ధికి మళ్ళీ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి రావాలని చీరాల అభివృద్ధికి కరణం వెంకటేష్ గెలవాలని ప్రచారంలో దూసుకుపోతున్నారు.గత ఐదేళ్ళ పరిపాలన లో చేసిన అభివృద్ధి,చీరాలలో నెలకొల్పిన ప్రశాంత వాతావరణం ప్రజలందరి ఆశీస్సులతో కరణం వెంకటేష్ గెలుపు ఖాయమని కరణం గీత ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నేడు గొట్టిపాటి నామినేషన్

విశాలాంధ్ర - అద్దంకి : నేడు అద్దంకి నియోజకవర్గ తెలుగుదేశం,జనసేన,బిజెపి ఉమ్మడి కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా గొట్టిపాటి రవికుమార్ నామినేషన్ వేసున్నట్లు గొట్టిపాటి క్యాంప్ కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ కార్యక్రమం ఉదయం 9.30 గంటలకు అద్దంకిలోని వేయి స్తంభాల గుడి,భవానీ సెంటర్ నుండి బయలుదేరి స్థానిక తహశీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమానికి అద్దంకి నియోజకవర్గ ప్రజలు టీడీపీ,జనసేన,బిజెపి,పార్టీల నాయకులు కార్యకర్తలు,గొట్టిపాటి అభిమానులు భారీగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నూతన వరుడిని ఆశీర్వదించిన గొట్టిపాటి

విశాలాంధ్ర - అద్దంకి : అద్దంకి నియోజకవర్గం పరిధిలోని పలు శుభకార్యములకు అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ గురువారం హాజరయ్యారు.మేదరమెట్ల గ్రామం పాత గుంటూరు రోడ్డు నందు జయరాం ఎంటర్ప్రైజెస్ వారి ఏడిఎంఎస్ ఈ బైక్స్ షో రూమ్ నూతన ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై షోరూంను ప్రారంభోత్సవం చేశారు.అనంతరం అద్దంకి మండలం మోదేపల్లి గ్రామానికి చెందిన కూరపాటి వెంకట రామారావు బాలకోటేశ్వరమ్మ దంపతుల కుమారుని వివాహం సందర్భంగా హాజరై వరుడు సాయి జగదీష్‌ను ఆశీర్వదించి వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.శంఖవరప్పాడు గ్రామానికి చెందిన ఏనుగు బ్రహ్మారెడ్డి రమాదేవి దంపతుల కుమారుని వివాహం పురస్కరించుకొని హాజరై వరుడు సుంకిరెడ్డిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.సంతమాగులూరు మండలం అడవిపాలెం గ్రామానికి చెందిన దిందు సుబ్బారావు,పున్నమ్మ దంపతుల కుమారుని వివాహం సందర్భంగా హాజరై అజయ్ బాబుకు ఆశీస్సులు తెలియజేశారు.గొట్టిపాటి వెంట ఆయా గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

ఒంగోలు ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డిని కలిసిన ముత్యాల నారాయణరెడ్డి, వైసీపీ నాయకులు

విశాలాంధ్ర-సీఎస్‌పురం : ఒంగోలు పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని గురువారం సీఎస్‌పురం మండలంకు చెందిన వైసీపీ నాయకులు ముత్యాల భారతినారాయణరెడ్డి మరియు ఆయన మిత్రబృందం కనిగిరిలో కలిశారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మాట్లాడుతూ త్వరలో జరిగే ఎన్నికల్లో ఒంగోలు పార్లమెంట్ అభ్యర్థిగా తనను, కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించడానికి ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మండల వైసీపీ నాయకులు ముత్యాల నారాయణరెడ్డి మాట్లాడుతూ ఒంగోలు ఎంపీ గెలుపు లాంచనమేనని అదే విధంగా కనిగిరి వైసీపీ అభ్యర్థి దద్దాల నారాయణ గెలుపుకు కృషి చేయాలన్నారు. సీఎస్‌పురం మండలంలో వైసీపీ పార్లమెంట్, ఎమ్మెల్యే అభ్యర్థికి భారీ మెజార్టీ వస్తుందని వారు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మేకల శ్రీనివాస యాదవ్, వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్ దుగ్గిరెడ్డి జయరెడ్డి, వైసీపీ నాయకులు పాలుగుళ్ల మల్లికార్జునరెడ్డి, రవి, రాధాకృష్ణారెడ్డి, ముడిమాల నారాయణరెడ్డి, రమణయ్య, బాలయ్య, శ్రీనివాసులరెడ్డి, రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

సివిల్స్‌లో విజయం సాధించిన జగన్నాథంకు అభినందనలు

విశాలాంధ్ర - అద్దంకి : సివిల్ సర్వీసులో మొదటి ప్రయత్నంలోనే ఐపీఎస్‌కు సెలెక్ట్ అయిన రాహుల్ జగన్నాథంను స్థానిక పట్టణంలోని బంగ్లా రోడ్‌లోని భాష్యం ఉన్నత పాఠశాలలో ప్రిన్సిపాల్ జి.వి.ఎస్.ఆర్ శాస్త్రి అధ్యక్షతన గురువారం అభినందనలు తెలియజేసి ఘనంగా సత్కరించి సన్మానించారు.ఈ కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల జోనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సాయి గణేష్ మాట్లాడుతూ భాష్యం పూర్వ విద్యార్థి రాహుల్ జగన్నాథంను విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని బాగా కష్టపడి ఇష్టంగా చదివి ఉన్నత స్థానంలో ఉండాలని కోరారు.రాహుల్ జగన్నాథ మాట్లాడుతూ మా కుటుంబం చాలా సామాన్య మధ్యతరగతి కుటుంబమని ,మా తల్లి తండ్రి జగన్నాథం బాబురావు,ప్రభావతి చదువుపై మక్కువతో బాగా కష్టపడి ఇష్టపడి చదివి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా అద్దంకి మండలంలో పనిచేస్తున్నారు. తల్లి దండ్రుల ప్రోత్సాహంతో పాటు విద్యార్థి దశలో భాష్యం విద్యా సంస్థల్లోని ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహం,ప్రేరణ ఈనాటి ఉన్నతికీ ఎంతో ఉపయోగపడిందన్నారు.నేను అద్దంకి బ్రాంచ్ లో 6,7,8,తరగతులు చదివిన తరువాత గుంటూరు భాష్యం హాస్టల్‌లో 9,10 తరగతులు చదివిన తరువాత ఇంటర్ విజయవాడ,ఇంజనీరింగ్ చెన్నై ఐఐటిలో కెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేసినట్లు తెలిపారు.నా తల్లి దండ్రులు అందించిన ప్రోత్సాహంతో హైదారాబాద్ 2020 - 21సంవత్సరంలో సివిల్ సర్వీస్ కోచింగ్ తీసుకొని నా తొలి ప్రయత్నంలో సివిల్స్‌లో 873వ ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు ఎంపికైనట్లు తెలిపారు.అనంతరం 873వ ర్యాంకు సాధించి ఐపీఎస్‌కు సెలక్ట్ అయిన భాష్యం విద్యా సంస్థల పూర్వ విద్యార్థి అయిన రాహుల్ జగన్నాథంను ప్రిన్సిపాల్ జి.వి.ఎస్.ఆర్.కె శాస్త్రి జెడ్.ఈ.ఓ సాయి గణేష్ సంస్థల డైరెక్టర్ భాష్యం రామకృష్ణ,మేనేజిమెంట్ తరుపున చిన్న మెమెంటోను అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి సన్మానించి అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

కొండేపి అభివృద్ధికి ఒక్క అవకాశం ఇవ్వండి

- 22న నామినేషన్ ఏర్పాట్లపై సమీక్షించిన మంత్రి ఆదిమూలపు సురేష్

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : కొండేపి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని ఒక్క అవకాశం ఇవ్వాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి కొండేపి వైసీపీ అభ్యర్థి ఆదిమూలపు సురేష్ ప్రజలను విజ్ఞప్తి చేశారు. ఈ నెల 22వ తేదీన ఆదిమూలపు సురేష్ నామినేషన్ చేయనున్న సందర్భంగా ఉదయం నుంచి టంగుటూరు, జరుగుమల్లి, కొండేపి మండలాల్లో పార్టీ కార్యాలయాల వద్ద ఆయా మండలాల ముఖ్య నేతలతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశారు. 22వ తేదీన నామినేషన్ సందర్భంగా చేపట్టబోయే భారీ ర్యాలీ, సభ, ఇతర కార్యక్రమాల ఎలా, ఏమిటి అనే దానిపై నాయకులతో చర్చించారు. అందరి నిర్ణయం మేరకు 22న వేలాది మందితో భారీ ర్యాలీ నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. అనంతరం కొండేపి మండలం దాచిరెడ్డి పాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ అభివృద్ధికి తనకు ఒక్క అవకాశం కల్పించాలని కోరారు. జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఆగిపోకుండా కొనసాగించేందుకు వైయస్ జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకుందామని అన్నారు. వచ్చే నెల 13న జరగనున్న ఎన్నికల్లో అందరూ ఓటింగ్‌లో పాల్గొనడంతో పాటు అత్యధిక మెజార్టీ తీసుకొచ్చి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. కొండేపి నియోజకవర్గం గత కొన్ని రోజులుగా అన్ని విధాలుగా పరిశీలిస్తున్నాని, ఈ నియోజకవర్గంలో గత పదేళ్లలో అనుకున్న స్థాయిలో అభివృద్ధి జరగలేదని, ఒక్కసారి తనకు అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఎలా ఉంటుందో చేసి చూపిస్తానని పేర్కొన్నారు. అందుకు మనమంతా రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ నెల 22న నామినేషన్‌కు అందరూ రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గడిచిన ఐదేళ్లలో జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను, లబ్దిదారులకు ఇచ్చిన స్కీంలను అందరికి వివరించారు.

చీరాలలో నామినేషన్ల స్వీకరణ ప్రారంభం

విశాలాంధ్ర - చీరాల : చీరాల పట్టణంలో మొదటి రోజున మాజీమంత్రి స్వర్గీయ ప్రగడ కోటయ్య మనుమడు పాలిశెట్టి శ్రీనివాసరావు తమ నామపత్రాలను ఆర్‌డీఓ కార్యాలయంలో సమర్పించారు.ఈ సందర్భంగా చీరాల సబ్ డివిజనల్ పోలీస్ అధికారి బేతపూడి ప్రసాద్ మాట్లాడుతూ గురువారం నుండి సార్వత్రిక ఎన్నికలకు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైందన్నారు.నామినేషన్ పత్రాలు సమర్పించే అభ్యర్థితో పాటు నలుగురికి మాత్రమే ప్రవేశం ఉందన్నారు.ఎన్నికలలో కోడ్ అమలులో ఉన్నందున ఎవరూ కూడా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దన్నారు.144 సెక్షన్ ,30 యాక్ట్ అమల్లో ఉన్నాయన్నారు.నియోజకవర్గంలోని ప్రజలు అందరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఆరచక శక్తులపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. రూరల్ సి.ఐ. నిమ్మగడ్డ సత్యనారాయణ,ఎస్సైలు వేమన,వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అశోక్ రెడ్డిని గెలిపించండి

విశాలాంధ్ర-కొమరోలు : గిద్దలూరు నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిల ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తుముల అశోక్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా కొమరోలు మండలంలో ముత్తుముల కుటుంబ సభ్యులు హరిత రెడ్డి, భారతి రెడ్డి, చలి చీమల శ్రీనివాస్ చౌదరి, కృష్ణమోహన్ రెడ్డి వార్డ్ నెంబర్ సుభాని, రాచర్ల ఖాజా, ఖాజావలి, మండల నాయకులు కార్యకర్తలు కొమరోలు మండలం బొద్దువానిపల్లి సురవారిపల్లి గ్రామాలలో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి మ్యానిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. నాడు తెలుగుదేశం హయాంలో అశోక్ రెడ్డి గారు శాసనసభ్యులుగా ఉన్న సమయంలో గిద్దలూరు పట్టణంలో ఎంతో అభివృద్ధి చేశారని, పట్టణంలో త్రాగునీటి సమస్యను పరిష్కరించారని ప్రజలకు ఏ సమస్య వచ్చిన స్థానికంగా అందుబాటులోనే ఉంటారని, గిద్దలూరు నియోజకవర్గంలో మరింత అభివృద్ధి జరగాలంటే మే 13వ తేదీన జరిగే ఎన్నికల్లో గిద్దలూరు ఎన్డీయే కూటమి అభ్యర్థిగా పోటీ చేయుచున్న ముత్తుముల అశోక్ రెడ్డికి మరియు ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయుచున్న మాగుంట శ్రీనివాసరెడ్డికి సైకిల్ గుర్తు పై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

విశాలాంధ్ర - అద్దంకి : పట్టణంలోని 3,5,6 వార్డులకు చెందిన పలువురు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని వీడి టీడీపీలో చేరారు.వీరికి అద్దంకి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.పార్టీలో చేరిన వారిలో సర్వేపల్లి ఆంజనేయులు సిద్ధాంతి,నర్రావుల ఏడుకొండలు,సింగరకొండ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం చైర్మన్ వినుకొండ వెంకట సుబ్బారావు,వైస్సార్సీపీ బీసీ అధ్యయన కమిటీ సభ్యుడు వెంకట్రావు మహేష్ సాయిరాం రామయ్య,సీతారామయ్య,సిద్ధు,హనుమాచారి శ్రీనివాసాచారి, మల్లేశ్వరరావు, నర్రావుల శ్రీనివాసరావు, సంజీవరావు, పి.శ్రీనివాసరావు,రావి ఆదెయ్య, ధర్మవరపురామయ్య,కిరణ్ ఉన్నారు.